# శ్రీ పిడతల రంగారెడ్డి

శ్రీ పిడతల రంగారెడ్డి 1968 సంవత్సరం జూలై 15 వ తేదీన శాసన పరిషత్తు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై 1972 వ సంవత్సరం మార్చి 13 వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

శ్రీ రంగారెడ్డి 1917 వ సంవత్సరం సెప్టెంబరు 10 వ తేదీన ప్రకాశం జిల్లా గిద్దలూరులో జన్మించారు.

శ్రీ రంగారెడ్డి 1940 లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని 500 రూపాయలు జరిమానా చెల్లించడంతోపాటు ఒక సంవత్సరం జైలు శిక్షను కూడా అనుభవించారు. 1942 సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1950 వ సంవత్సరంలో మద్రాసు శాసనసభనుండి ప్రావెన్షియల్ పార్లమెంట్‌కు ఎన్నికైనారు.

శ్రీ రంగారెడ్డి 1952 సంవత్సరంలో ఉమ్మడి మద్రాసు శాసనసభకు ప్రకాశం జిల్లా కంభం నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. 1955 సంవత్సరంలో గిద్దలూరు నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు.

శ్రీ రంగారెడ్డి శ్రీ దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో 1960 వ సంవత్సరం జనవరి 11 వ తేదీ నుండి 1962 సంవత్సరం మార్చి 11వ తేదీ వరకు ప్రణాళికా అభివృద్ధి, పంచాయతీరాజ్, సమాచార, ప్రచారం, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసారు. ప్రణాళికా శాఖా మంత్రిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఆ శాఖను ఆయన నడిపించిన తీరు తెన్నులు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపచేసాయి.

వీరు 1966 వ సంవత్సరం జూలై 1 వ తేదీన కర్నూలు స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి శాసన పరిషత్తుకు పోటీ లేకుండా ఎన్నికై 1972 వ సంవత్సరం మార్చి 13 వ తేదీ వరకు సభ్యులుగా కొనసాగారు.

1972 వ సంవత్సరంలో గిద్దలూరు నియోజకవర్గం నుండి ఐదవ శాసనసభకు ఎన్నికైన వీరు 1972 వ సంవత్సరం మార్చి 21వ తేదీ నుండి 1974 వ సంవత్సరం

సెప్టెంబరు 25 వ తేదీ వరకు స్పీకరుగా పనిచేసి ఆ పదవికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చారు.

శ్రీ వెంగళరావు మంత్రి వర్గంలో శ్రీ రంగారెడ్డి ఆర్థిక, వాణిజ్య పన్నులు, గృహనిర్మాణం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేసారు.

శ్రీ రంగా రెడ్డి 1978 వ సంవత్సరం ఆరవ శాసనసభకు, 1985 వ సంవత్సరం ఎనిమిదవ శాసనసభకు గిద్దలూరు నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. 1985 వ సంవత్సరంలో వీరు ప్రొటెం స్పీకరుగా బాధ్యతలను నిర్వర్తించారు.

వీరు 1969 లో ట్రినిడాడ్ అండ్ టుబాగో, 1971 లో మాల్వాయ్ దేశాలలో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పాల్గొన్నారు. శ్రీ రంగా రెడ్డి అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మని, రష్యా మొదలైన దేశాలలో పర్యటించారు.

శాసన పరిషత్తు ఛైర్మన్‌గా, శాసనసభ స్పీకర్‌గా ఎంతోమందికి ఆదర్శప్రాయులైన శ్రీ పిడతల రంగా రెడ్డి 1991 సంవత్సరం జూలై ఒకటవ తేదీన మరణించారు.